క్లుప్తంగా

మొసలి సంచారం



ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడుమకాల్వలో మొసలి సంచారంతో రైతులు, ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ఆత్మకూర్ మండలంలోని మూలమల్ల శివారులోని ప్రధాన ఎడుమ కాల్వలో ముసలి సంచరిస్తుంది. ఫారెస్టు అధికారులు స్పందించి ముసలిని ఇక్కడి నుంచి తరలించాలని రైతులు కోరుతున్నారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి

అమరచింత: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో అలసత్వం చూపరాదని జెడ్పీటీసీ మార్క సరోజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నర్మద అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మండలంలోని ఆయా అంగన్‌వాడీ టీచర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ ప్రతివారం అంగన్‌వాడీ చిన్నారుల ఆరోగ్య వివరాలతో పాటు వారి పెరుగుదల, బరువులను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పావని పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేసిన వ్యక్తికి రిమాండ్

వనపర్తి: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు వనపర్తి టౌన్ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన ఓ మహిళకు వివాహమై ఒక పాప ఉంది. ఆ తర్వాత భర్తతో విడాకులు తీసుకుని కొన్నాళ్లుగా ఒంటరిగా ఉంటోంది. ఆమెకు సమీప బంధువు అయిన పెబ్బేరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. పెళ్లి చేసుకోవాలని కొన్ని రోజుల అడగగా.. అతను దాటవేస్తూ వచ్చాడు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఈనెల 18న పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. శనివారం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నాడు.

బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేస్తాం

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని బస్టాండులో విద్యార్థులు, ప్రయాణికుల సౌకర్యార్థం త్వరలోనే బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయనున్నామని నాగర్‌కర్నూల్ జిల్లా డిపో మేనేజర్ ధరంసింగ్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఆర్‌టీసీ సిబ్బందితో కలిసి గోపాల్‌పేట మండల కేంద్రంలోని బస్టాండును పరిశీలించారు. బస్‌పాస్ కౌంటరు ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని స్థానికుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. జూన్ ఒకటిన కౌంటర్ ఏర్పాటు చేస్తామని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు బస్‌పాసు కౌంటర్ సేవలు వినియోగించుకోవాలని కోరారు. అలాగే బస్సులు ఏమైనా అవసరం అయినా తమ దృష్టికి తీసుకువస్తే ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

లారీ తగిలి విరిగిన విద్యుత్ స్తంభం



గోపాల్‌పేట: రేవల్లి మండల కేంద్రంలో శనివారం ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వడ్ల లోడు లారీ విద్యుత్ వైర్లకు తగలడంతో వైర్లతో పాటు విద్యుత్ స్తంభం విరిగి కిందపడిపోయింది. దీంతో రేవల్లి మండల కేంద్రంలో ఉదయం నుంచి కరెంటు సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం అధికారులు స్పందించి వైర్లు సరిచేయడంతో పాటు మరో కరెంటు పోల్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఇదిలా ఉండగా మండలంలో చాలా చోట్ల విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని, విద్యుత్ అధికారులు వాటిని సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని రేవల్లి మండల ప్రజలు కోరారు.

ఓఆర్ఎస్‌తో ఉపశమనం

ఆత్మకూర్: ఎండలు అధికమైన నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, తరుచూ ఓఆర్ఎస్ ద్రావనాన్ని తీసుకోవాలని హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని ఆరేపల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎండలో తిరగరాదని, చల్లని ప్రదేశాల్లో ఉండాలని, ఓఆర్ఎస్‌తో పాటు కొబ్బరి నీళ్లు, మజ్జిగ తాగాలని, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సరిత, అంగన్‌వాడీ టీచర్లు ఆశమ్మ, నర్సుబాయి, ఆశాలు లలితబాయి, కతలమ్మ, గ్రామస్తులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో క్రమం తప్పకుండా డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మురుగును తొలగించడానికి చర్యలు తీసుకున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కమిషనర్ మహమ్మద్‌ఖాజా తెలిపారు. మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో శనివారం పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న మురుగు కాల్వల పరిశుభ్రత పనులను పరిశీలించారు. ఈమేరకు కమిషనర్ మాట్లాడుతూ సీడీఎంఏ ఆదేశాల మేరకు అన్ని వార్డుల్లో సంపూర్ణ పారిశుద్ధ్య పనులను చేపడుతున్నామన్నారు. తడి, పొడి చెత్తను ఆరు బయట పారవేయకుండా వాటిని తమ వార్డులకు వస్తున్న చెత్త సేకరణ ట్రాక్టర్లకు అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐదో వార్డు కౌన్సిలర్ రాజ్‌కుమార్, నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణంలోని కాలనీలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ అవగాహన కల్పించారు. శనివారం 6వ వార్డులో మురుగు కాల్వలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, సీడీఎంఏ ఆదేశాల మేరకు పట్టణ పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమం చేపట్టి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ ఆదిశేషు, కౌన్సిలర్ రామకృష్ణ నాయుడు, మేనేజర్ గణేష్‌బాబు, వెంకట్రాములు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న చైర్‌పర్సన్ కరుణశ్రీ

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మంగంపల్లిలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ అఫ్జల్ పరిశీలించారు. గ్రామంలో గల పాత గోడలను కూల్చివేయాలని, ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వేసవిలో పశువులకు, పక్షులకు, జంతువులకు తాగునీటికి ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు గ్రామాల్లో ఇది వరకు నిర్మాణం చేసిన నీటి తొట్టిలను శుభ్రం చేసి నీళ్ల పట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో గల నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలస్వామి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఆగారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, యువకులు శ్రమదానం చేశారు. గ్రామంలోని ప్రధాన రహదారులను ఊడ్చి శుభ్రపర్చారు. అప్పారెడ్డిపల్లి, ఖిల్లాఘనపురం, సల్కెలాపురం తదితర గ్రామాల్లో పిచ్చమొక్కల తొలిగింపు, డ్రెయినేజీలు శుభ్రం చేయడం, రోడ్లు ఊడ్చడం తదితర పారిశుద్ధ్య పనులు చేపట్టారు. షాపురంలో పర్యటించిన ఎంపీడీఓ విజయ్ కుమార్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో గుర్తించిన పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు.



అమరచింతలో..



ఆగారంలో శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు



మంగంపల్లిలో..

బాల్య వివాహాలు చేయడం నేరం



మాట్లాడుతున్న అధికారులు

పెబ్బేరు రూరల్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, చిన్న పిల్లలకు పెళ్లిళ్లు చేయడం ద్వారా వారిలో ఎదుగుదల ఉండదని సర్పంచ్ ఆంజనేయులు అన్నారు. శనివారం శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో మహిళల అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాంబాబు హాజరై గ్రామ స్థాయిలో బాలల సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ, బాలల హక్కులను వివరించారు. బాలలకు స్థానికంగా ఉన్న పరిస్థితుల గురించి, వారికి ఎదురయ్యే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్ల వయస్సులో ఉన్న వారికి ఆపద వస్తే 1098 కాల్ చేయవచ్చని సూచించారు. బాల్య వివాహ నిషేధ చట్టం–2006, పోక్సో 2012 చట్టబద్ధత గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి నరేందర్, కార్యదర్శి జీవిత, పోలీసు అధికారులు మునిస్వామి, రాంబాబు, అంగన్‌వాడీ కార్యకర్త శశికళ, ఆశాకార్యకర్త భారతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని సంరక్షించాలి

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో ప్లాస్టిక్ రీసైకిల్ చేసేందుకు కృషి చేయడంతో పాటు పర్యావరణాన్ని కాపాడటానికి ముందుకు రావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ కోరారు. శనివారం పట్టణ కేంద్రంలోని 5, 6 వార్డుల్లో ప్లాస్టిక్ రీసైక్లింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'లైఫ్ మేరా స్వచ్ఛ షెహర్' కార్యక్రమంలో భాగంగా ఆర్ఆర్ఆర్ రీసైకిల్ సెంటర్లు ఏర్పాటు చేశామని, పట్టణ ప్రజలు తమ ఇళ్లలోని పొడి చెత్త, ప్లాస్టిక్ బాటిల్స్, పాత బట్టలు, పాత చెప్పులు, పాత బుక్కులు ఇలాంటి వస్తువులను ఆర్ఆర్ఆర్ సెంటర్ల దగ్గర తెచ్చి వాటిని ఇస్తే రీసైకిల్ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ ఆదిశేషు, కౌన్సిలర్ రామకృష్ణనాయుడు, గోపిబాబు, మేనేజర్ గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పాత వస్తువులను అప్పగించండి

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ వద్దనున్న పాత వస్తువులు, బట్టలు, పాదరక్షలు, బుక్కులు, న్యూస్‌పేపర్లు అప్పగించాలని పుర వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు అశ్విన్‌కుమార్, మహేశ్వరి అన్నారు. శనివారం ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్ఆర్ఆర్ కార్యక్రమంలో భాగంగా వార్డుల్లో శిబిరాలను ఏర్పాటు చేసి పాతవస్తువులను సేకరించారు. పాత సామాన్లు అప్పగించిన వారికి ప్రశంస పత్రాలను అందజేస్తామని, పట్టణ అభివృద్ధికి, పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇంటర్ అధ్యాపకులు

పాన్‌గల్: మెరుగైన విద్య కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పించాలని కోరుతూ పాన్‌గల్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు అన్నారం, అన్నారంతండా గ్రామాల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల గృహాలకు వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పొందాలని అధ్యాపకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశం శెట్టి మాట్లాడుతూ పాన్‌గల్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌ల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కళాశాలల్లో శిక్షణ, అనుభవం కలిగిన అధ్యాపకులతో ఉత్తమ బోధన అందుతుందని, ఉచిత అడ్మిషన్, పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనాలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం సుదర్శన్‌రెడ్డి, ఆనంద్, సువర్ణ, వహీదా పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

వనపర్తి: జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆయన అభిమానులు శనివారం యువ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్‌టీఆర్ ఫ్యాన్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, పట్టణ అధ్యక్షులు శ్రీరామ్, యువశక్తి ఫౌండేషన్ నిర్వాహకులు మధు, నవీన్ పాల్గొన్నారు.

కేసు నమోదు

ఆత్మకూర్: హత్యాయత్నం బెదిరింపులతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహ్మద్‌అంజద్ తెలిపారు. పట్టణానికి చెందిన జానకీరాం స్థానికంగా ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఉండగా ముగ్గురు అగంతకులు తనపై దాడి చేయడంతో పాటు హత్య చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

బతుకమ్మలతో వీఓఏల నిరసన

అమరచింత: కనీసం వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శనివారంతో 34వ రోజుకు చేరింది. చాలీచాలని వేతనాలతో తమ కుటుంబాలను గడపడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఈమేరకు శనివారం మండల మహిళా సమాఖ్య ఆవరణంలో బతుకమ్మను తయారు చేసి ఆట పాటలతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు పర్మినెంట్ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వీఓఏలకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రంగన్న, శివుడు, పావని, రజిత, నర్మద, మాధవి, సునీత పాల్గొన్నారు.

పాన్‌గల్: తమ డిమాండ్ల సాధన కోసం ఐకేపీలో పనిచేస్తున్న గ్రామ సహాయకులు(వీఓఏ) 34 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము అన్నారు. శనివారం వీఓఏల సమ్మెకు మద్దతు ప్రకటించి బతుకమ్మతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రమాద బీమా, అర్హతలను బట్టి పదోన్నతులు, గ్రేడింగ్‌లతో సంబంధం లేకుండా వేతనాలు అమలు వంటి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు శేషయ్యనాయుడు, భాగ్యమ్మ, నీలమ్మ, శశికల, స్వరూప, ధర్మయ్య, బాలరాజ్, కృష్ణయ్య, నరేష్, రాజు, మమత, లక్ష్మి పాల్గొన్నారు.

కొత్తకోట: మండల కేంద్రంలో వీఓఏలు బతుకమ్మను ఏర్పాటు చేసి బొడ్డెమ్మలతో పాటలు పాడి నిరసన వ్యక్తం చేశారు. వీఓఏల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వీఓఏల మండల అధ్యక్షుడు నరిసింహ కోరారు. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న వీఓఏలను పలకరించేందుకు దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అక్కడికి రాగా వారి డిమాండ్లను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, మండల వీఓఏల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు అరుణ, కోశాధికారి శ్రీలత, వీఓఏలు మంజులత, పల్లవి, విమల, నీరజ, శివాణి పాల్గొన్నారు.



కొత్తకోటలో బతుకమ్మ ఆడుతన్న వీఓఏలు



పాన్‌గల్‌లో..



అమరచింతలో..

ఖిల్లాఘనపురం: ఐకేపీలో విధులు నిర్వహిస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐకేపీ వీఓల సంఘం మండల అధ్యక్షుడు ఖాదరయ్య అన్నారు. మండల కేంద్రంలోని మండల సమాఖ్య వద్ద ఐకేపీ వీఓఏలు బతుకమ్మ ఆడుతూ సమ్మెను కొనసాగించారు. వీఓఏలు ఈశ్వరమ్మ, లక్ష్మి, కృష్ణయ్య, శ్రీశైలం, జ్యోతి, రేణుక, లత, గౌరమ్మ, మంగ, శ్రీను, గౌసియాబేగం, రేష్మాబేగం, సరిత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఆధార్' అప్‌డేట్ కార్యక్రమం

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో కొనసాగుతున్న ఆధార్ అప్‌డేట్ కార్యాక్రమాన్ని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు పొంది పదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి జీపీ భవనంలో అప్‌డేట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని సూచించారు. గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని నిర్వహిస్తున్న విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీంతో పాటు రేమద్దులలో కొనసాగుతున్న ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని సర్పంచ్ మంజుల పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ, ఆధార్ కేంద్రం నిర్వాహకుడు తిరుపతయ్య, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



తెల్లరాళ్లపల్లితండాలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

మంత్రి, ఎమ్మెల్యే కృషితో భూ పరిహారం మంజూరు



సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు

పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లిలో డీ 8 ఎంజే–4 కాల్వ తవ్వకంలో భూములు కోల్పోయిన రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కృషితో రైతులకు భూ పరిహారం మంజూరైనట్లు బీఆర్ఎస్ జిల్లా నాయకులు చంద్రశేఖర్‌నాయక్, వనపర్తి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ డా.లతీఫ్ అన్నారు. రైతుల ఖాతాల్లో భూ పరిహారం డబ్బులు జమ కావడాన్ని హర్షిస్తూ సర్పంచ్ వెంకటయ్య యాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి ఆధ్వర్యంలో రైతులు శనివారం గ్రామంలో సీఎం కేసీఆర్, మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములు కోల్పోయిన అన్నారంతండా, దావాజిపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 92 మంది రైతులకు రూ.1.56కోట్ల నగదును ఖాతాల్లో జమ చేయించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఠాకూర్‌నాయక్, మన్నెంయాదవ్, గోపాల్‌గౌడ్, గణేష్‌యాదవ్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

పాన్‌గల్: సైబర్ క్రైంపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ ఆధార్, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలను ఇతరులకు తెలియపర్చకూడదని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ విజయ్ అన్నారు. శనివారం మండలంలోని దావాజిపల్లిలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో బ్యాంకు సేవలు, డిజిటల్ చెల్లింపులు, బ్యాంకింగ్ కార్డులు, సైబర్ క్రైం తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లో కూడా ఇతరులకు చెప్పకూడదన్నారు. బ్యాంకు అధికారులం, బహుమతులు వచ్చాయంటూ సైబర్ నేరస్తులు మోసం చేస్తుంటారని, వాటిని నమ్మకుండా ఉండాలని, అలాంటి వారి నుంచి ఫోన్‌లు వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. క్రాంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.



బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న విజయ్

ముందుకు సాగని డ్రెయినేజీ నిర్మాణం

- వర్షాకాలం వస్తే పనులు జరగడం ప్రశ్నార్థకమే



నిర్మాణం చేపట్టాల్సిన కాల్వ



కాల్వలో నిలిచిన మురుగు

అమరచింత: పట్టణంలోని చింతలయ్య స్థూపం నుంచి ఎస్సీ కాలనీ వరకు ఉన్న చెరువు కాల్వ నిర్మాణ పనులు మరుగునపడ్డాయి. వేసవి కాలంలోనే పనులు పూర్తి చేయడానికి ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్ వర్షాకాలం సమీపిస్తుండటంతో పనులు సకాలంలో పూర్తి చేయడం ప్రశ్నార్థకమే అని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి నూతన కాల్వ నిర్మాణ పనులకు సుమారు రూ.48 లక్షలు మంజూరయ్యాయి. నీటిపారుదల శాఖకు చెందిన కాల్వను నిర్మించేందుకు రెండు నెలల కిందట పనులు ప్రారంభించారు. కాల్వ నిర్మాణం కోసం కాంట్రాక్టర్ పనులను చేపడుతుండగా మురుగునీటితో పాటు సమీపంలోని పంటపొలాల్లో నీరు నిల్వ ఉండటంతో నిర్మాణ పనులకు ఆటంకం కలిగింది. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో కాల్వ నిర్మాణ పనులకు ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్మించే అవకాశం ఉన్నా సంబంధిత కాంట్రాక్టర్ చొరవ చూపడం లేదు. ఇళ్ల సమీపంలో మురుగు కాల్వ ప్రవహిస్తుడంతో ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి పోతున్నాయని, దీంతో ప్రజలు డెంగీ జ్వరం బారిన పడే అవకాశం ఉందని వాపోతున్నారు. మురుగు నుంచి వచ్చే దుర్గంధంతో నిత్యం నరకం అనుభవిస్తున్నామని వాపోయారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజాను వివరణ అడగగా.. పని ప్రదేశంలో చిత్తడి, బురద ఉందని కాల్వ నిర్మాణానికి ఇబ్బంది కలుగుతుందని, వీటి కోసం కాల్వ పక్క నుంచి మట్టి రోడ్డు వేస్తూ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ డబ్బులు చెల్లించాలి

వనపర్తి: ఉపాధి కూలీలకు పెండింగ్ కూలి వెంటనే మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి ఆయన సంఘీభావం వ్యక్తం చేసి మాట్లాడారు. 41 డిగ్రీల ఉష్ణోగ్రతల్లోనూ.. పని చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించటం లేదని, పనిముట్లుకు డబ్బులు ఇవ్వడం లేదన్నారు. సౌకర్యాల విషయమై కలెక్టర్ డీఆర్‌డీఓకు ఎన్ని సార్లు వనతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌డీఓ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఎస్. రాజు, అజయ్, సీనియర్ మేట్లు శ్రీనునాయక్, కవిత, వసీరాం, నిరంజన్, నరసింహాగౌడ్, రాంజ్యప్రసాద్, నందిమల్ల రాములు, మద్దిలేటి మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయులు

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

వనపర్తి: పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో శనివారం వ్యవసాయ, పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మురళీకృష్ణ ఆగ్రో ఏజెన్సీలో గడువు ముగిసిన వరి విత్తనాలను పట్టుకున్నారు. దుకాణ యజమానిపై కేసు నమోదు చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యంబాబు, వ్యవసాయ అధికారి కురుమయ్య, టౌన్ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలో గల ఫర్టిలైజర్ షాపుల్లో కల్తీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశానుసారం శనివారం మండల వ్యవసాయ అధికారి కుర్మయ్యతో కలిసి మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ హరిప్రసాద్ మాట్లాడుతూ రైతులు తమకు కావాల్సిన ఎరువులను, విత్తనాలను లైసెన్స్ పొందిన షాపుల్లోనే కొనుగోలు చేయాలని, ఎరువులకు, విత్తనాలకు సంబంధించిన రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

గోపాల్‌పేట: ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు రైతులకు కల్తీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రేవల్లి మండల అగ్రికల్చర్ ఆఫీసర్ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన రేవల్లి మండలంలోని చెన్నారం, కేశంపేటలలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో రేవల్లి ఎస్‌ఐ శివకుమార్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్‌ను పరిశీలించారు.



పెద్దమందడిలో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ హరిప్రసాద్, ఏఓ కుర్మయ్య



వనపర్తిలో..